క్లుప్తంగా

పోలేరమ్మ అమ్మవారికి సారె సమర్పణ



మంగళగిరి: నగరంలోని కుమ్మరి బజారులోని పోలేరమ్మ అమ్మకి ఆదివారం పట్టణ ఆర్యవైశ్య మహిళలు సారె సమర్పించారు. అంతకు ముందు ఉదయం ఆరు గంటలకు పోలేరమ్మ అమ్మ వారికి అభిషేకాలు, పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించి సారె, బోనం సమర్పించారు. ఈ సందర్భంగా ముత్తయిదువులకు, భక్తులకు జాకెటు ముక్క, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో వాసవీ పరివార్ రాష్ట్ర మహిళా విభాగం కోశాధికారిణి గాదంశెట్టి సుజాత, మాజేటి మీనాకుమారి, దివ్వెల ఆదిలక్ష్మి, వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కనకదుర్గ, సుజాత, కోశాధికారి గాయత్రి, రాజ్యలక్ష్మి అమ్మవారి భక్త బృందం అధ్యక్ష, కార్యదర్శులు కొనకళ్ల రమాదేవి, చెరుకూరి నాగేశ్వరి, సికాకొలను పద్మ, వనమా అన్నపూర్ణ, ఆలేటి నాగలక్ష్మి, నేరెళ్ల లక్ష్మీరాధిక పాల్గొన్నారు.

వైఎస్సార్ షాదీ తోఫా అమలుపై హర్షం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): పేద ముస్లిం ఆడబిడ్డల పెళ్లికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ షాదీ తోఫా పథకాల ఆర్థిక సహాయాన్ని రాష్ట్రంలోని నూర్‌బాషా, దూదేకుల, పింజరి, లద్దాఫ్ ముస్లింలకు కూడా వర్తించేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. ఆదివారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

మహిళలకు న్యాయ సహాయంపై అవగాహన

తాడేపల్లిరూరల్: మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమని కేఎల్‌యూ లా కళాశాల విభాగాధిపతి జి.విజయసుధ అన్నారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఆదివారం మహిళలకు న్యాయ సహాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళల హక్కుల గురించి, చట్టాలపై వారికి అవగాహన కల్పించేందుకు కేఎల్‌యులోని న్యాయ కళాశాల అధ్యాపకులతో పాటు కేఎల్ మహిళా ఫోరం ముందుంటుందన్నారు. మహిళల్లో చట్టపరమైన అవగాహన పెంపొందించడం, చట్టపరమైన సహాయ సేవల గురించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. మహిళా ఫోరం సభ్యురాలు డాక్టర్ కె.రూతు రమ్య మాట్లాడుతూ న్యాయ సహాయ సేవలు, న్యాయ సహాయాన్ని పొందడంలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు, లింగ ఆధారిత హింసను పరిష్కరించడంలో న్యాయ సహాయం పాత్ర గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, అధ్యాపకులు శైలజ పాల్గొన్నారు.

ఇద్దరికి టిఫిన్ బండ్లు అందజేత

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని ఇద్దరికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఆర్థిక సహకారంతో టిఫిన్ బండ్లు అందజేశారు. చినకాకానికి చెందిన మల్లవరపు వసంతరావు, నగరంలోని ఎయిమ్స్ గేటు సమీపంలోని నివాసం ఉండే లక్ష్మి అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, ఆకురాతి రాజేష్, పారేపల్లి మహేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మంగళగిరి: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ అక్కల సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలోని పెదవడ్లపూడి, చినకాకాని ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సాగర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాగునీరు సరఫరా

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని కార్మెల్ మాత ఉత్సవాల సందర్భంగా గ్రామానికి చెందిన సాగర్ ఫౌండేషన్ చైర్మన్ ఆరే విజయభాస్కరరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తాగునీరు సరఫరా చేశారు. ఫౌండేషన్ ద్వారా 24 గంటలు మంచినీరు ఉచితంగా అందిస్తున్నట్లు విజయభాస్కరరెడ్డి తెలిపారు.

అమరావతి రైతుల సుదర్శన యాగం

మందడం(తాడికొండ): తుళ్లూరు మండలం మందడం గ్రామంలో అమరావతి రైతులు ఆదివారం సుదర్శనయాగం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు హాజరై మహిళలతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చౌడేశ్వరి అమ్మవారి బోనాల మహోత్సవం



బోనాలతో గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

మంగళగిరి: నగరంలోని శ్రీ చౌడేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా ఆదివారం బోనాల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొప్పురావుకాలనీ తాగునీటి ట్యాంకు వద్ద నుంచి భక్తులు అమ్మవారి బోనాలతో గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాలు, కనకతప్పెట్లతో మహోత్సవం ఉత్సాహంగా కొనసాగింది. కొప్పురావు కాలనీలో ప్రారంభమైన ఉత్సవం తెనాలి రోడ్డు, రాజీవ్ సెంటర్, ద్వారకా నగర్, ఘాట్ రోడ్డు మీదుగా గండాలపేటలోని పోలేరమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.
కార్యక్రమంలో సంఘం నాయకులు మాడిశెట్టి శివ శంకరయ్య, మోతిక సత్యనారాయణ, అల్లక తాతారావు, కొసనం శ్యామలరావు, విడాల ప్రసాద్, అల్లక నమశ్శివాయ, యుద్ధం అప్పారావు, మాన్యం అచ్చెయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలవాటిక పిలుస్తోంది..!

- కేంద్రీయ విద్యాలయాల్లో యూకేజీ ప్రవేశానికి అవకాశం
- తెనాలి, గుంటూరులోని రెండు కేంద్రాలు ఎంపిక
- ప్రారంభమైన ఆన్‌లైన్ దరఖాస్తులు
- ఈ నెల 18న ఆఖరి గడువు



తెనాలిలోని కేంద్రీయ విద్యాలయం



కేంద్రీయ విద్యాలయం వద్ద ఏర్పాటు చేస్తున్న బాలవాటిక ఫ్లెక్సీ

తెనాలిఅర్బన్: న్యూ ఎడ్యుకేషన్ పాలసీ-20లో భాగంగా కేంద్ర ప్రభుత్వం కేంద్రీయ విద్యాలయాల(కేవీ)లో చిన్నారులకు ప్రవేశం కల్పించనుంది. దీనిలో భాగంగా కేవీలలో బాలవాటిక-3లను ఏర్పాటు చేసి, దానిలో ప్రీ ప్రైమరీ(యుకేజీ) తరగతులు నిర్వహించనుంది. అందుకు అవసరమైన అదేశాలు ఇవ్వటంతో పాటు సీట్ల భర్తీ ప్రక్రియను ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంలో భాగంగా కేంద్రీయ విద్యాలయాల్లో ప్రీ ప్రైమరీ తరగతిని(యుకేజీ) ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించింది. దీనిలో 40 సీట్లు ఉంటాయి. అయిదు సంవత్సరాలు నిండి.. ఆరో ఏట అడుగుపెట్టిన చిన్నారులు అర్హులు. అన్ని రకాల రిజర్వేషన్లు సీట్ల భర్తీలో వర్తిస్తాయి. ప్రీ ప్రైమరీలో ఉత్తీర్ణత సాధించిన వారు నేరుగా 1వ తరగతికి ప్రమోట్ అవుతారు.

జిల్లాలో తెనాలి, గుంటూరు కేవీల్లో...

దేశ వ్యాప్తంగా 450 కేంద్రీయ విద్యాలయాల్లో నూతనంగా బాలవాటిక-3 కేంద్రాలను ప్రారంభించేందుకు కేంద్రం అనుమతులు ఇచ్చింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో రెండు కేవీలకు అనుమతులు వచ్చాయి. వాటిలో తెనాలి, గుంటూరు సమీపంలోని నల్లపాడు విద్యాలయ షిఫ్ట్-1 ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి వాటిలో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభం కానున్నాయి.

దరఖాస్తు ఇలా..

కేవీలో దరఖాస్తు చేసుకునేందుకు కేంద్రీయ విద్యాలయ సంఘట ఈ నెల 6 నుంచి 18వ తేదీ వరకు అవకాశం కల్పించింది. చిన్నారి మార్చి 31, 2023లోగా అయిదు సంవత్సరాలు నిండి ఆరు సంవత్సరంలో కొనసాగుతూ ఉండాలనే నిబంధన ఉంది. దరఖాస్తుల పరిశీలన 20వ తేదీ నిర్వహించనున్నారు. 28న అర్హుల జాబితా ప్రకటించనున్నారు. 29 నుంచి చిన్నారులకు తరగతులు ప్రారంభించనున్నారు. విద్యా హక్కు చట్టం కింద ఎంపిక ఉంటుంది. పూర్తిగా కేంద్రీయ విద్యాలయ సంఘట నిబంధనల మేరకు ప్రవేశాలు ఉంటాయి.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

బాలవాటిక కేంద్రాల్లో ప్రవేశాలకు ఇప్పటికే దరఖాస్తులు ఆహ్వానించాం. నిబంధనల మేరకు సీట్లను భర్తీ చేస్తాం. పూర్తిగా కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌నిబంధనల పాటిస్తాం. httpr://kvsonlineadmission.kvs.nic.in లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వివరాలకు విద్యాలయంలో సంప్రదించాలి.

– కె.శ్రీకాంత్, ప్రిన్సిపల్, కేవీ, తెనాలి.

శ్మశానాల్లో మౌలిక వసతుల కల్పన

మేయర్ కావటి, ఎమ్మెల్యే గిరి



క్రిమిటోరియం నిర్మాణ శంకుస్థాపనలో పాల్గొన్న మేయర్ కావటి, ఎమ్మెల్యే గిరి

నెహ్రూనగర్: నగరంలో శ్మశానాల్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. శ్రీనివాసరావుపేటలోని కైలాస భూమి హిందూ శ్మశానవాటికలో రూ.1.30 కోట్లతో గ్యాస్ క్రిమిటోరియం నిర్మాణానికి ఆదివారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌తో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంటూరు నగరంలో శ్మశానవాటికల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, వాటి కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. నగరంలోని ఎనిమిది డివిజన్ల ప్రజలు శ్రీనివాసరావుపేట శ్మశానవాటికను వినియోగిస్తున్న దృష్ట్యా, రూ. 5.75 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా గ్యాస్ క్రిమిటోరియం నిర్మాణానికి శంకుస్థాపన చేశామని వివరించారు. ప్రస్తుతం ప్రజలు కర్మకాండలు నిర్వహించడానికి బస్టాండ్ వద్ద గల సత్రాన్ని వినియోగిస్తున్నారని, ఇకనుంచి శ్రీనివాసరావు పేట శ్మశానవాటికలోనే నిర్వహించడానికి భవనాన్ని నిర్మిస్తున్నామని వెల్లడించారు. దీంతో పాటు కొన్ని రోజుల పాటు అక్కడే ఉండటానికి గదులు, భోజనశాల, వంటశాల, కేశ ఖండనం, స్నానపు గదులు, అస్థికలు భద్రపరుచు గదులు, బయట రోడ్డు విస్తరణ, లైటింగ్‌తో పాటు ఆహ్లాదకర వాతావరణ ఉండేలా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. పార్థివ దేహాల్ని కొన్ని రోజుల పాటు భద్రపరచడానికి ప్రత్యేకంగా ఐస్ మార్చురీ గదులు, బాక్సులు, పలు దేవతామూర్తుల విగ్రహాలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, కాండ్రుకుంట గురవయ్య, నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు గేదెల రమేష్, తేలుకుంట్ల యోగేశ్వరరావు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.


జీవితాన్ని తీర్చిదిద్దేది చేతిరాత



చేతిరాత నైపుణ్యంలో శిక్షణ ఇస్తున్న ఉప్పాల రామ్మోహనరావు

గుంటూరు ఎడ్యుకేషన్: జీవితాన్ని తీర్చిదిద్దేది చేతిరాత అని ప్రముఖ చేతిరాత నిపుణుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామ్మోహనరావు పేర్కొన్నారు. చైతన్యపురిలోని విజ్ఞానంద బాలకుటీర్‌లో జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల తోపాటు విద్యార్థులకు ఆదివారం చేతిరాత నైపుణ్యంలో శిక్షణ తరగతుల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ 10 వేల మంది ఉపాధ్యాయులతో పాటు లక్ష మంది విద్యార్థుల చేతిరాతను మార్చాలనే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు చెప్పారు. గత రెండేళ్లలో 2000 మంది ఉపాధ్యాయులు, 25వేల మంది విద్యార్థుల చేతిరాతను మార్చినట్లు తెలిపారు. బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బి.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ చేతిరాతను చక్కగా మార్చుకోవడం ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుతో పాటు విజయం దిశగా దారి తీస్తుందని తెలిపారు. చేతిరాతను మెరుగుపరచుకోవడం ద్వారా మానసిక పరమైన మార్పులు సంభవించి, చదువుపై ఏకాగ్రతతో ముందుకు వెళతారని వివరించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల చేతిరాతోని నైపుణ్యాలు, మెలకువలు పెంపొందించేందుకు కృషి చేయాలని తెలిపారు. చేతిరాత బాగున్న వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, తద్వారా ఎంచుకున్న రంగంలో విజయం సాధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సీహెచ్. జ్ఞానప్రసూన, ప్రిన్సిపాల్ చిన్నం సాంబశివరావు, ట్రస్ట్ కో-ఆర్డినేటర్ సీహెచ్. రమేష్, శావల్యాపురం ఎంఈవో లలిత కుమారి, శావల్యాపురం జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం బి. విజయలక్ష్మి, ఎల్.ఎఫ్.ఎం హెచ్‌ఎం గంగవరపు వెంకాయమ్మ, చేతిరాత సహాయ నిపుణులు కె.ఎస్. ప్రసాద్, సాయి విశ్వనాథ్, పి. రాధాకృష్ణమూర్తి, పి.పద్మ, బురాన్, నాగమణి, పి. శ్రీనివాసరావు, టి. శ్రీనివాసరావు, ప్రసాద్, వంద మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనుల పండువగా గౌరీ విశ్వేశ్వరుల కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పాత గుంటూరు: బ్రాడీపేట రెండో లైనులోని గౌరీ విశ్వేశ్వరాలయంలో స్వామి జన్మనక్షత్రం సందర్భంగా ఆదివారం ఉత్సవమూర్తులకు కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు విశ్వేశ్వర శర్మ ఆధ్వర్యంలో జరిగిన కల్యాణంలో పీటలపై బండి విజయ్, సీతారావమ్మ, పామర్తి వెంకటేశ్వరరావు, కనకదుర్గ దంపతులు కూర్చున్నారు. కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మ, మల్లికార్జున శర్మ, గిరిధర్, చక్రపాణి పర్యవేక్షించారు.

నేడు మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభం



మంగళగిరి: మంగళగిరి- తాడేపల్లి నగరంలో పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో తూర్పు గోదావరి జిల్లా కడియం నుంచి పలు రకాల మొక్కలను తెప్పించిన అధికారులు సోమవారం ఉదయం ఎమ్మెల్యే ఆర్కే చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. గండాలయస్వామి కొండ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అవతరించడంతో పాటు నగరవాసులకు పర్యావరణాన్ని, ఆహ్లాదాన్ని అందించనుంది. మొక్కలను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) పరిశీలించారు.

విద్యుత్ స్తంభంతో వణుకు



పాత గుంటూరు: మూడో డివిజన్ పరిధిలోని ప్రగతీనగర్ 5వ లైనులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం కారణంగా స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల ఓ లారీ ఢీకొనడంతో స్తంభం పూర్తిగా ధ్వంసమైంది. సంఘటన జరిగి నెల రోజులు గడుస్తున్నా విద్యుత్ సిబ్బందిలో చలనం లేదు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని నివాసితులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో విద్యుత్ షాక్ తగిలే ప్రమాదముందని వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి స్తంభాన్ని మార్పించాలని పలువురు కోరుతున్నారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరీ



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని అన్నమయ్య కళా వేదికపై నాగార్జున సాంస్కృతిక కేంద్రం, సంగీత కళాశాల ఆధ్వర్యంలో డి.వి.ఆర్. సీత గాత్ర కచేరీ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. చావలి శ్రీనివాస్, కె.వి రామకృష్ణ వాయిద్య సహకారం అందించారు. ముఖ్య అతిథిగా అటవీ శాఖ అధికారి శ్రీనివాస రావు, ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. రామకృష్ణ పాల్గొని కళాకారులను సత్కరించారు. కళాశాల అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి ఈ.ఎస్.ఆర్ మూర్తి, డాక్టర్ ఎమ్మెస్ శ్రీధర్ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని సంస్థ ప్రధాన కార్యదర్శి సూర్య నారాయణ పర్యవేక్షించారు.

లంక భూములకు పట్టాలు ఇవ్వాలి

ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు



రైతులతో మాట్లాడుతున్న ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): అనేక సంవత్సరాలుగా లంక భూములను సాగుచేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు కోరారు. దుగ్గిరాల మండల పరిధిలోని పెదకొండూరులో ఆదివారం దాసరి విజయలక్ష్మి అధ్యక్షత లంక భూముల రైతుల సమావేశం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ లంక భూములు సాగు చేసుకుంటున్న వారికి పట్టాలు ఇవ్వకపోవడంతో అనేక మందికి వారి భూములు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని, దీని కారణంగా పాస్ పుస్తకాలు పొందలేకపోతున్నారని అన్నారు. పంట రుణాలు పొందలేక అధిక వడ్డీలకు రుణాలు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లంక భూములు ప్రస్తుతం ఎవరు సాగు చేస్తున్నారో సర్వే చేసి వారికి వెంటనే పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నవ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ అనేక కష్టాలను ఎదుర్కొని లంక భూములు సాగుచేసుకుంటున్నప్పటికీ వారి పంటలను ఈ క్రాప్ చేయడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు, కౌలు రైతుల సంఘం మండల అధ్యక్షులు భీమిరెడ్డి అమ్మిరెడ్డి, ఎం.గోపి, లంక భూముల రైతులు పెరూలు, పిరాట్ల నాంచారయ్య, పిరాట్ల దయాసాగర్, వెలివెల బాబు, రంగాన పాములు, మొలబంతి పుట్లమ్మ, కనుమోలు వెంకటేశ్వరరావు, తమ్మిల సత్యనారాయణ పాల్గొన్నారు.

రోటరీ క్రికెట్ లీగ్ మ్యాచ్



క్రికెట్ ఆడుతున్న రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి, రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి రోటరీ సభ్యులు

తాడేపల్లిరూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి, రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం కుంచనపల్లి ఎస్ స్క్వేర్ టర్ఫ్స్ గ్రౌండ్‌లో రోటరీ క్రికెట్ లీగ్ మ్యాచ్ నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్లు మురళీకృష్ణ, వేణుగోపాల్, జోనల్ చైర్మన్ బెల్లంకొండ నాగసాయి ప్రసాద్, పీవీ సత్యనారాయణ, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు పరుచూరి కిరణ్, కార్యదర్శి చంద్ర ఓబులా రెడ్డి, మాజీ అధ్యక్షులు మున్నంగి వివేకానందరెడ్డి, కోశాధికారి గోపు నాగరాజేష్, ఆర్.సుకుమార్ రెడ్డి, కాట్రగడ్డ శివన్నారాయణ, రావూరి రమేష్‌బాబు, శెట్టి రామకృష్ణ, దోనేపూడి క్రాంతి కుమార్, మల్లికార్జునరావు, చంద్రశేఖర్ రెడ్డి, శంకర్ శెట్టి రమేష్, ఎస్.వి. నాగకిరణ్, ఎం.నగేష్, కె.నరేంద్ర, రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు అందె రేవంత్, కార్యదర్శి గాజుల శ్రీనివాసరావు, కోశాధికారి నూతలపాటి వెంకటేశ్వరరావు, అందే మురళీమోహనరావు, మాయకుంట క్రాంతి కుమార్, పారేపల్లి నిరంజన్ గుప్తా, అనిల్ చక్రవర్తి, ప్రగడ రాజశేఖర్, తులిమిల్లి రామకృష్ణ, మాజీ అధ్యక్షులు త్రిపురమల్లి సతీష్, రామనాథ్ నాగేశ్వరరావు, గల్లా అమరేష్, ముదిగొండ కోటేశ్వరరావు, షేక్ జిలాని, డాక్టర్ దామర్ల శివ పాల్గొన్నారు.

ఆస్పత్రి పరిశుభ్రత అందరి బాధ్యత

సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్



భోజనశాలను పరిశీలిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ శ్రావణ్

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో పారిశుద్ధ్య సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వల్లే పరిశుభ్రత లోపిస్తోందని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఆదివారం రోగుల సహాయకులు వేచి ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ వాతావరణం పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదకరంగా ఉన్నా పరిసరాలు మాత్రం అపరిశుభ్రంగా ఉండటంపై అసంతప్తి వ్యక్తం చేశారు. రోగుల సహాయకుల కోసం ఏర్పాటు చేసిన భోజనశాల షెడ్డులో కోవిడ్ పీపీ కిట్లు ఉండటాన్ని గుర్తించారు. వాటిని అక్కడ నుంచి వేరే చోటకు తరలించాలని ఫార్మాసిస్టుల్ని ఆదేశించారు. రోగులు వారి సహాయకులు ఎక్కడ పడితే అక్కడ భోజనాలు చేయకుండా, భోజనశాల వద్ద మాత్రమే చేయాలని సూచించారు. ఆస్పత్రిలో పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు. తనిఖీల్లో సూపరింటెండెంట్ వెంట అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శ్రావణ్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె. ఆశాసజిని ఉన్నారు.

జీజీహెచ్‌లో వైద్య సేవలు భేష్

జీజీహెచ్‌లో వైద్య సేవలు బాగున్నాయని విశ్రాంత డీఎంహెచ్‌ఓ డాక్టర్ పరశురామయ్య అన్నారు. గుంటూరు జీజీహెచ్‌లో ఆపరేషన్ చేయించుకుని ఐసీయూలో లో చికిత్స పొందుతున్న ఆయన్ను ఆదివారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ పలకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ పరశురామయ్య మాట్లాడుతూ డాక్టర్ కిరణ్ కుమార్‌పై ఉన్న నమ్మకం తో జీజీహెచ్‌లో ఆపరేషన్ చేయించుకున్నట్లు వెల్లడించారు. ఐసీయూలో అన్నీ సౌకర్యాలు బాగున్నాయని తెలిపారు.

రేడియాలజీ టెక్నీషియన్స్ సమస్యలపై వినతి

కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ రేడియోలాజికల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ నేతలు ఆదివారం గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను కలసి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. డీఎంఈ దృష్టికి సమస్యల్ని తీసుకెళ్లి పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తానని డాక్టర్ కిరణ్‌కుమార్ హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి. రవీంద్ర, కార్యదర్శి బి. మణిబాబు, జాయింట్ సెక్రటరీ ఎం. షకీన్‌బాబు, జిల్లా అధ్యక్షుడు వై. వరుణ్‌ప్రకాష్, జె. హరినాథ్, వై. యలమంద రావు, వై.వి. చారి ఉన్నారు.

భగవత్ చింతనతోనే మానవునికి ప్రశాంతత



సభలో మాట్లాడుతున్న రామాంజనేయశర్మ

పాత గుంటూరు: భగవత్ చింతన ద్వారా మానవునికి ప్రశాంతత లభిస్తుందని కోగంటి రంగనాయకి అన్నారు. ఏటీ అగ్రహారంలోని కంచి కామకోటి పీఠ శంకర గాయత్రీ మందిరంలో ఆదివారం కోగంటి అప్పలాచార్యులు అభినందన సభ నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన గాయత్రీ వేద శాస్త్ర పరిషత్ అధ్యక్షుడు రాళ్లబండి జనన వేంకట సత్య రామాంజనేయశర్మ మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి వేద పురాణ వ్మాయం పట్టుగొమ్మని, దాన్ని కాపాడు కోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సుమారు 14 సంవత్సరాల నుంచి కోగంటి అప్పలాచార్యులు పురాణ ప్రవచనం చేస్తున్నారని , వారి గళం నుంచి జాలువారిన అమృత వాక్కులు భక్తుల్ని చైతన్య వంతం చేశాయని చెప్పారు. సభలో ఆకెళ్ల మల్లు సోమయాజులు, ముళ్లపూడి సత్యనారాయణ శాస్త్రి, పి.వి. భావన్నారాయణ, నైషధం భాస్కర్ పాల్గొన్నారు. అనంతరం పౌరాణికులు కోగంటి అప్పలాచార్యులును ఘనంగా సత్కరించారు.

జూదరుల అరెస్టు

పట్నంబజార్: చంద్రమౌళీనగర్‌లోని ఓ ఇంటిలో పేకాడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. 11మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,11,000తో పాటు 13 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్ని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

- నెహ్రూనగర్‌లోని ఆరో లైన్‌లో పేకాడుతున్న నలుగురిని కొత్తపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1800 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుల్ని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచినట్లు తెలిపారు.